# దర్గామిట్ట కతలు

## కతల వెనక కత!

ఆర్నెల్లకో సమచ్చరానికో మూడు చెరువుల నీళ్లు తాగి ఒకటో అరో కతలు రాసుకునే నాకు యిరవై అయిదు వారాల పాటు 'దర్గామిట్ట కతలు' రాసుకునే చాన్సు వచ్చిందంటే అది చిన్నకత కాదు.

ఆ కతకు నాయకుడు నామిని.

ఆంధ్రజ్యోతి వీక్లీ ఇన్‌చార్జిగా తిరపతి నుంచి హైదరాబాద్‌కి ఆయన ట్రాన్స్‌ఫర్ అయి వచ్చినాక 'మా రూముకి రండి సా' అని పిలిచినాను.

వచ్చినాడు.

ఒక చేతిలో చిన్నసంచీ. యింకొక చేతిలో విడిచిన గుడ్డలున్న ప్లాస్టిక్కు కవరు. ప్రభావతినీ పిలకాయల్నీ యింకా పిలచకరాలేదాయన.

మా రూముకు రావడంతోటే బ్యాగులో నుంచి ఒక ఫొటో తీసి బయట పెట్టినాడు.

అది వాళ్లమ్మ సినక్కది.

నేను దానితట్టే చూసినాను. బావుగారు ఎంతో ప్రేమగా వేసిచ్చిన ఆ బొమ్మ ఎంతో దయగా చూసింది నన్ను.

"ఇదేనబ్బా నేను సంపాదించుకున్న ఆస్తి" అన్నాడు నామిని, ఆ ఫోటోను లక్షన్నొకటోసారి చేతుల్లోకి తీసుకుంటా.

నేను కూడా అవురూపంగా ముట్టుకున్నాను దానిని, ఇట్టాంటి ఆస్తి నేనింకా సంపాదించుకోలేదే అనుకుంటా.

ఆ తర్వాత రోజూ రాత్రివూట గడ్డ పెరుగు, పొద్దున వూట వేప వుల్లలు సరఫరా చేసి నామినిని లైనులో పెట్టుకున్నాను. ఆయన మూడ్డు గమనించుకొని ఒక రాత్రి చిన్నగా నా కతలు బయిటికి తీసి 'చదవండి సా' అన్నాను.

ఒకటి దావత్. ఇంకొకటి జమీన్.

ఆయన బాసిమెట్టు వేసుకొని చదివినాడు.

'దావత్ మంచి కత. జమీన్ బాగలా' అన్నాడు, రెండింటినీ చాపమీద పెడతా.

నేను గమ్మునున్నాను.

"ఆరెస్సెస్ వాళ్లు ముస్లింలని తిడతా కత రాస్తే దానికెంత విలువో, నువ్వు ఆరెస్సెస్ వాళ్లని తిడతా 'జమీన్' రాస్తే దీనికీ అంతే విలువ" అన్నాడు మళ్లా.

నేను తల ఊపినాను.

'అంతే గదా!' అన్నాడు.

"మీకంతే కావచ్చుగానీ అట్టాంటి కతలు కూడా రాయాలి సా! కాళ్ల కింద నేల లాకుండా పోతా ఉంటే కడుపు మంటతో యిట్టాంటివి కూడా వస్తాయి సా" అన్నాను.

'వస్తే రాయి' అన్నాడు.

"రాస్తే పేరొస్తుంది గానీ మంచి పేరు రాదు. మేదావులు చదవతారు గాని మామూలు ఆడోళ్లూ, మొగోళ్లూ చదవరు" అన్నాడు మళ్లా.

నేను గమ్మునుండిపోయినాను.

ఆ రాత్రి నిద్ర పోయినాం. పొద్దున్నే వీపు మీద తట్టి బలవంతంగా లేపినాడు నామిని.

'ఏంది?' అన్నాను, దుప్పటి ముసుగు తీస్తా.

'వసంతలక్ష్మి యింటికి పోదాం సా' అన్నాడు.

'దేనికి?' అన్నాను.

"సినబ్బ కతల పుస్తకం తెచ్చుకోవాల. అందులోని బొమ్మ 'అమ్మకు జేజే' యాడ్‌కి వాడుకోవాల" అన్నాడు.

ఇద్దరం కలిసి లక్డీకాపూల్‌కి ఆటో ఎక్కినాం.

దారిలో నామిని అన్నాడు.

"ప్రతొక్కడూ వాళ్లమ్మ గురించి, వాళ్ల నాయిన గురించి, బాల్యం గురించి కూడా రాయాలబ్బా. అట్టా రాస్తేనే మనకు తెలియని జీవితాలు బయట పడతాయి. ఆ జీవితాల్లోని బ్యూటీ తెలుస్తుంది".

'చాన్సు రాబళ్లా' అనుకున్నాను మనసులో.

'కష్టపడి యాతనపడి దావత్, జమీన్ మాదిరి కతలు రాయడం కాదబ్బా. నీకు నిజ్జంగా పేరు రావాలంటే మీ అమ్మ గురించీ మీ నాయిన గురించీ రాయి. వాళ్ల కతలు చెప్తా వుంటావు కదా రాసేదానికేం?' అన్నాడు.

నాకు ఆశ వుట్టింది.

'వేస్తారా సా' అని అడిగినాను.

"కళ్లకద్దుకొని" అన్నాడాయన.

చాన్సయితే వచ్చిందిగాని 'ఎలా రాయడం?' అనే తపన మొదలయ్యింది నాలో. అదీ వారం వారం. ఒకో వారం ఒకో కత అంటే మాటలా?

సరే. ఎట్నోకట్ట రాద్దాముగాని ముందీ కతలకి ఏ పేరు పెడదాం? అని ఆలోచించినాను.

'సాయిబూ కతలు అని పెడితే' అన్నాను రెండు రోజుల తర్వాత.

"మా హిందువులు చదవగూడదనా?" అన్నాడాయన దీర్గం తీస్తా.

"ముస్లింల జీవితాలకు సింబాలిక్‌గా 'జెండామాను' మాదిరిగా ఏదైనా ఆలోచించు" అన్నాడాయన.

మా ఊరిలోని వీదుల పేర్లతో 'కసాబ్ గల్లీ కతలు', 'జెండా వీధి కతలు'...యిట్టా ఆలోచించినాను.

చివరకు 'దర్గామిట్ట కతలు అని పెడదాము సా' అన్నాను.

ఇద్దరం ఆ పేరే బాగుందనుకున్నాం.

యింక రాయడమే...

దోవ వెతుక్కోవడానికి 'పచ్చనాకు సాక్షిగా', 'పెన్నేటి కతలు', 'అమరావతి కథలు', 'అంటరానోళ్ల ఆత్మ కతలు', 'మాదిగోడు కతులు' సంపాదించి చదివినాను– మళ్ళా ఒక దఫా.

పెన్నేటి కతలు, అమరావతి కతల్లో అమ్మా నాయినా లేరు. అవి నాకు దారి చూపవు. బాస దెబ్బకు 'మాదిగోడు కతులు' చదవడం నా వల్ల గాలా.

యింకప్పుడు నామిని మాటలు గుర్తుకొచ్చినాయి.

"నేను ఎమ్మెస్సీ మాథ్సు. కతను స్టెప్ బై స్టెప్ప పర్‌ఫెక్ట్‌గా నడిపించడం నాకు తెలుసు" అంటా ఉంటాడాయన.

ఒకాకు తక్కువైనా నేను మాత్రం చదవ లేదా బిఏస్సీ మాథ్సు. పైగా 'జవహర్ భారతి'లో. నామిని స్టెప్ బై స్టెప్ పద్దతిని ఆ మాత్రం కనిపెట్ట లేనా? అని 'పచ్చనాకు సాక్షిగా' కతల వుస్తకం తీసినాను.

ఒకో కత చదివినాను.

మళ్లీ చదివినాను.

అట్టా మళ్లీ మళ్లీ చదవతానే ఉండిపోయినాను. చదివే కొద్దీ నాకర్దమై పోయింది, యింత పొయెటిక్‌గా రాయడం మన వల్ల కాని పని అని.

అయితే ఏ లెక్క చేయడానికైనా ఒక పద్దతి గాకుంటే యింకో పద్దతి ఉంటుంది. అట్టాగే నామినిలా రాయలాకపోయినా ఆయన చూపునైనా పట్టుకుందామనిపించింది.

వడేసి పట్టుకున్నాను!

'దర్గామిట్ట కతల' వెనుక ఉన్నది ఆ చూపే.

ఆ సూత్రాలతో చూసినప్పుడు మా అమ్మా, మా నాయినా, మా ఇల్లూ, మా కసాబ్ గల్లీ, మా ఊరూ, మా కష్టాలూ, మా సుఖాలూ, మా 'ముదిగారాలూ', మా 'మొగలాయితనాలూ'...చిన్న చిన్నవే... కానీ అవురూపమైన కతలుగా దర్శనమిచ్చాయి నాకు.

యిక ఎక్కడ లేని ధైర్యం వచ్చింది.

దానితో పాటు వీక్లీలో 'యాడ్' వచ్చింది, 'దర్గామిట్ట కతలు' రాబోతా ఉన్నాయని.

దానిని చూడగానే నామిని గారిని కొందరు 'శ్రేయోభిలాషులు' హెచ్చరించడం మొదలు బెట్టినారు.

'ఈ ముస్లింల గొడవ ఏంది సామీ' అని ఒకరూ, 'ముస్లింల గురించి రాస్తే వాళ్లు దండెత్తి వొస్తారయ్యో' అని యింకొకరూ ఆయన్ను దడిపించినారు.

ఆయన పట్టుకుంటే వొదిలేవోడు గాదు గదా. 'ఆ కతలు రావాల్సిందే' అని కూచునేసినాడు.

నేను కూడా దర్గామిట్ట కతలు మొదలు పెట్టేసినాను, 'నా పేరు పెట్టింది

# దర్గామిట్ట కతలు

మీసాల సుబ్బరాజు' కతతో.

నా మటుకు నాకు బలే ఇచ్చిత్రం.

దావత్, జమీన్‌లకు పడినట్టుగా యీడ కష్టపళ్లా. యాతనపళ్లా. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ కింద నా రూములో కూర్చొని కావలిలోని మా అమ్మ తట్టూ, నాయన తట్టూ, వీధి తట్టూ, ఊరు తట్టూ, ముస్లిం ప్రపంచం తట్టూ, మానవ జాతి తట్టూ ఒక్క చూపు చూస్తే చాలు యెమ్మట్నే కత వుట్టేది.

మా అమ్మ ఒక్కపొద్దులు ఎందుకు ఉండేది కాదో గుర్తుకు తెచ్చుకుంటే అదొక కత. నేను ఎందుకు ఉర్దూ నేర్చుకోలేదో? అనుకుంటే అదింకో కత. జాగీర్దారు బిడ్డయిన మా నాయిన కరెంటు పనోడు అవడం ఒక కత. మా అమ్మ వూలమ్మడం కత. వాజిద్ సాయిబు జేబులో మంచి జరినాంటీ డబ్బులు కొట్టెయ్యడం కత. మా పండగా కతే. మా పీర్లూ కతే. కూచ్చుంటే కత...లేస్తే కత...

మా రూములో పాతచాప మీద బోర్లా పడుకొని ఒకో కత చెప్తా ఉంటే అబిడ్స్ వీదుల్లో ఏనుగు అంబారీ నెక్కినంత దర్జాగా ఉండేది.

రాయగా రాయగా మంచి నీళ్ళు తాగడం కన్నా యీ కతలు రాయడమే సులువుగా అనిపించింది నాకు. పిలకాయలు- స్నేహితుల నోటు బుక్కు తీసుకొని 'చూసీరాత' రాసినట్టే. నేను రాసిన ప్రతి కతా చూసే కదా- కావలిని. అంతే! కావాల్సినన్ని కతలు నా ముందర క్యూ కట్టేవి.

కతలు అచ్చవడం మొదలయినాయి.

కడపరెడ్డి ఒకాయన (పేరు శ్రీనివాసరెడ్డి) ఫోను చేసి 'పలావెంకారెడ్డి పలావు పెట్టీవా?' అని అడిగినాడు. (లేని) నా బ్యాంకు ఖాతాలో లక్షలొచ్చి పడిపోయినాయి. మద్రాసు నుంచి ఒకమ్మాయి 'మీ మస్తాన్ సురేష్ ఎలా ఉండాడు?' అని ఒక రాసింది. అంతే. నా అకౌంట్‌లో కోట్లొచ్చి పడిపోయాయి.

రోజూ ఉబ్బి తబ్బిబ్బవడమే.

ఒకరోజు ఆంధ్రజ్యోతికి ముళ్లపూడి వెంకటరమణ గారు దేవుడిలాగా వచ్చి- రంజాను గదా అందుకనీ- చేతిలో స్వీటు పాకెట్ పెట్టారు.

ఇప్పటికే ఖాతా నిండిపోయింది. నెత్తి మాత్రం ఖాళీగా ఉంది. రెండు కొమ్ములు మొలిచినాయి.

నెల్లూరు జిల్లాలోని కావలిలాంటి చిన్న వూరులో వుండే మా అమ్మ సర్తాజ్‌బీ, మా నాయిన కరీంభాయ్- ఈ రోజున ఈ ఆంధ్రాలో పది మందికైనా తెలిసినారు. మా అమ్మా నాయినా కొందరిని నవ్వించినారు, ఏడిపించినారు, చివరాఖరికి గుర్తుండిపోయినారు.

యాభైతొమ్మిదేండ్లకే మా నాయిన మమ్మల్ని ఒంటరోళ్లని చేసి- వెళ్లిపోయినాడు. మా అమ్మ అనారోగ్యం వల్ల ఆమె పనులు ఆమె చేసుకోలాక అగచాట్లు పడతా ఉంది.

మా అమ్మా నాయిన పేరు ఈ దర్గామిట్ట కతల పుణ్యాన నేను పదిమందికీ చెప్పకపోయి ఉంటే- మా అమ్మనీ, మా నాయిన్నీ తలుచుకొని తలుచుకొని నిజంగానే నేను ఈ పాటికి దిగులుతో వూపిరి పోగొట్టుకోని వుండేవాడ్ని.

ఈరోజు నేమూ ఒక మొగోడిలాగా నలుగురిలో నవ్వతా తిరగతా ఉన్నానంటే మనమూ- మన అమ్మా నాయినా పేరును నిలబెట్ట గలిగినాము అనే నమ్మకం తోనే.

ఈ కతలను పదిమందే చదివినా వందమంది చదవక పోయినా...నేను చెప్పాల్సిన కతలన్నింటినీ దయతో చెప్పనిచ్చిన ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె.జగదీష్ ప్రసాద్ గారికి, ఎడిటర్ శ్రీ ఐ.వెంకటరావు గారికీ నమస్కారాలు!

—మహమ్మద్ ఖదీర్‌బాబు



## యీ కతలన్నీ మా నాయినకి!

డిసెంబర్ 9, 1996 సోమవారం తెల్లవారు జామున తిరపతి స్విమ్స్ ఆస్పత్రిలో చనిపోయినాడు మా నాయిన. చనిపోయే ముందర 'కావలి కావలి కావలి' అని మూడుసార్లు మా ఊరు పేరు చెప్పినాడు. అవే ఆయన ఆఖరి మాటలు!

మా నాయిన మా ఊరిని ఎంతగా ప్రేమించినాడో మా ఊరు కూడా మా నాయిన్ని అంతగా కావిలించుకుంది. పెండెం రవి, పలావెంకారెడ్డి, సైకిల్ షాపు గంగాదరం, నాగబూషణం, హుసేన్ భాయ్, కల్లయ్యగారు ఒకరనేంటి అందరూ. ఆయన స్నేహితులే. బతికుండగా ఆయన మూట కట్టుకుంది ఆస్తిని కాదు. స్నేహితులని!

మా నాయినకు ఆయన స్నేహితుల దగ్గర ఎంత చనువు వుండేదో నా స్నేహితుల దగ్గర కూడా అంతే చనువు ఉండేది. శ్రీధర్‌గాడో, మాలకొండరావుగాడో మా యింటికి వచ్చినప్పుడు మాతో కూర్చొని మాటలు చెప్తా ఉండేవాడు. డిగ్రీ అయినాక ఆంధ్రజ్యోతిలో చేరి హైద్రాబాద్ నుంచి నేను జాబులు రాయకపోతే 'మావాణ్ణి జాబు రాయమనండయ్యా' అని నా స్నేహితులకు చెప్పేవాడు గానీ నాకు చెప్పేవాడు కాదు. అమ్మా నాయినల మాటకంటే స్నేహితుల మాటలే బిడ్డలు వింటారని మా నాయినకు తెలుసు. మా నాయిన నాకు కొడుగ్గా కాకుండా స్నేహితుడిగా చూసేవాడు. ఆఫీసుకు సెలవు పెట్టి, పొద్దున ఎనిమిదీ ఎనిమిదిన్నరకల్లా మా ఊర్లో దిగితే, మా యింటికి నాలుగడుగుల దూరంలో ఉండే సుందరయ్య బంకు కాణ్ణుంచి పేపరు అవతల పారేసి మెరుస్తున్న కళ్ళతో ఎదురు వచ్చేవాడు మా నాయిన. భుజం మీద చెయ్యివేస్తా, 'క్యా బాబా' అంటా నా చేతిలోని బ్యాగు అందుకునే వాడు.

ఇప్పుడు అలా పలకరించడానికి మా నాయిన లేడు, మా నాయిన స్నేహితులు తప్ప.

ఈ కతలని నేను మా నాయినకు 'అంకితం' యిస్తా వున్నానంటే మా నాయిన స్నేహితులకు కూడా యిచ్చినట్టే- యిష్టంతో కన్నీటితో.